# విముక్తి

**-కె. తాయారమ్మ**

''విత్తొకటి వేస్తే మొక్కొకటి మొలుస్తుందా?''

బాజా భజంత్రీల మధ్య, పెళ్ళి హడావిడి మధ్య, ఆ జన సందోహంలోంచి, అలా అలా గాలిలో తేలి వచ్చి సౌజన్యమూర్తిగారి కర్ణపుటాల్ని తాకింది ఆ మాట!

చివుక్కుమంది ఆయన మనస్సు.

ఒక్కసారి పెళ్లిమంటపం వైపు చూశారు.

పెళ్లికొడుకు హోదాలో, పెళ్లిపీట మీద కూచుని వున్నాడు శివతేజ.

ఏ భావం ద్యోతకం కావడం లేదు అతని ముఖంలో.

పురోహితుడు పెళ్లిమంత్రాలు ఉచ్చరిస్తున్నాడు, ఇంకా పెళ్లికూతుర్ని తీసుకురాలేదు.

మరొక్కసారి శివతేజ ముఖంలోకి చూశాడు. భావాల కందని భాష, భాషకందని భావం తనది!. మరి శివతేజ? అతడు కూడా పెద్దలమాటకి తలవంచేడా? శివతేజ ఎవరు? తన కొడుకు! తన కొడుకు తేజా!

తన అమాయకత్వం, తన తెలివి తక్కువతనం, తన బలహీనత, వ్యక్తిత్వంలేని తన మనుగడ, ఇవన్నీ సంతరించుకు పుట్టాడా తేజా?''

అందుకేనా ఈమాట? 'విత్తొకటి వేస్తే మొక్కొకటి మొలుస్తుందా?'

నవ్వులు, అవహేళనలు, వీటి మధ్య తను!

అతని గురించి తనకే చిరాకుగా వుంటోంది. జీవితం సంఘర్షణ మయం.

మందపాటి కళ్లద్దాలు, కొంచెం పలచబడుతున్న. జుట్టు, ఖరీదైన పంచె, సిల్కులాల్చీ, జరీ కండువా, ఖరీదైన వాచీ, ఉంగరాలు, మెళ్లోగొలుసు, ఇదీ సౌజన్యమూర్తిగారి మూర్తిమత్వం.

అయినా ఏదో వెలితి, ఏదో నైరాశ్యం.

కిసుక్కున నవ్వులు. అటువైపు చూశాడు.

అందరి మధ్య వరూధిని. వయస్సుని దాచుకోవాలనే ప్రయత్నంలో వరూధిని. పరిసరాలని లెక్క చెయ్యని వరూధిని.

స్లీవ్‌లేస్ బ్లౌజు, పలుచని విదేశీ చీర, భుజాల వరకు వేలాడుతున్న అమెరికన్ డైమండ్సు లోలాకులు, బాబ్డ్‌హెయిర్, రోజ్‌పౌడరు, లిప్‌స్టిక్, స్నేహితుల మధ్య నిలబడి కూల్‌డ్రింకు తాగుతోంది వరూధిని.

జుగుప్సతోపాటు మనస్సు కూడా కలుక్కుమంది.

ఇన్నాళ్ళు తన సంసార జీవితం ఎలా గడిచింది? నిరాశా నిస్పృహలమధ్య వరూధిని అజమాయిషీ, అధికారం క్రిందపడి నలిగిపోయింది!

ధన దర్పం కింద కర్కశంగా నేల కరుచుకుపోయింది.

తాను భర్తస్థానంలో వున్న ఓ మృణ్మయశిల్పం!

రేపు తేజా జీవితం కూడా ఇంతేనా?

''హాయ్ వరూధినీ, నీ సుపుత్రుడికి తండ్రిగారి పోలికే వచ్చినట్టుంది! ఇంకో వరూధుని జీవితం సుఖమయం!'' ఆరేళ్లు అమెరికాలో వుండి ఇండియా తిరిగి వచ్చిన అఖిలాండేశ్వరి అంది. ఆ గొంతులో జలసీ తొంగి చూసింది.

వరూధిని కళ్లల్లో ఎరుపురంగు కదలాడింది.

''నా కోడలు వరూధిని కాదు! సీత! నా కొడుక్కి ఎవరి కింద లొంగి వుండవలసిన అవసరం లేదు!

నా కొడుకు ధనాధిపతి. ఈ సంపదకి వారసుడు. నా కోడలు నిరుపేద కుటుంబంలోంచి వచ్చింది.

నేను ధనంలో పుట్టాను, ధనంలో పెరిగాను, ధనంలో మునిగి తేలుతున్నాను. నాతోసాటి ఎవరికీ లేదు.''

అహం, దర్పం, నిర్లక్ష్యం నర్తించేయి ఆ కంఠ స్వరంలో.

చాముండేశ్వరి కోపం గొంతులోనే దాచుకుంది. వరూధిని స్నేహం ఆమెకు స్టేటస్ సింబల్.

''హలోవరూధినీ!'' ఎవరో పిలవడంతో అటు నడిచింది వరూధిని.

''పెళ్ళి కూతుర్ని తీసుకురండి!''పురోహితుడు అరుస్తున్నాడు.ముత్తయిదువలు పెళ్లి కూతుర్ని వెంట పెట్టుకొచ్చారు.

నవవధువు ప్రమద పెళ్లిపీటల మీద కూచుంది.

అటు వైపు చూశాడు సౌజన్యమూర్తిగారు.

గూడు కట్టిన నైరాశ్యం తొంగి చూస్తోంది పెళ్లికూతురు ముఖంలో.

కొంచెం దగ్గరగా నడిచాడాయన.

ఆమె ఏడ్చిందనడానికి గుర్తుగా కాటుకతో కూడిన కన్నీటి చారికలు.

ఆమె తల నిమరాలనీ, ఆమె అంతరంగపు లోతులు తెలుసుకోవాలనీ, ఓ వింత జిజ్ఞాస.

''కాని అదెలా సాధ్యం? ఆ ఇంట్లో తన స్థానం ఏమిటి? కొడుకు గురించి తెలుసుకోగలిగేడా? కాబోయే కోడలి గురించి తెలుసుకోడానికి?''

వేదాంతంతో కూడిన నవ్వు వెలిగింది సౌజన్యమూర్తిగారి పెదాలమీద!

మరొక్కసారి పందిరంతా కలయచూశారు సౌజన్యమూర్తిగారు.

ఓ వైపు అగ్రాసనం మీద కూర్చుని వుంది మీనాక్షీదేవిగారు- పెళ్లికొడుకు అమ్మమ్మ హోదాలో; కట్నం లేకుండా పేదింటి పిల్లని చేసుకున్నారన్న ప్రశంసల మధ్య.

''పేద పిల్లకి మనసుండదా? ఉండకూడదా?'' కళ్లద్దాలు తీసి ఓసారి తుడిచి పెట్టుకున్నాడు.

ఈనాడు పేద పెళ్లికూతురు స్థానంలో ప్రమద!

ఆనాడు...ఆనాడు. పేద పెళ్లికొడుకు స్థానంలో...తను...

డబ్బులో ముంచెయ్యాలనీ, సంఘంలో హోదానీ, పరపతినీ పెంచాలనీ, నాన్నమ్మ, తాతయ్యల ఆలోచన తన మెడలు వంచింది.

సంఘంలో మిగిలిన వాటి స్థానం ఎలా వున్నా, తను మాత్రం వరూధిని భర్తగా మిగిలాడు.

ఆ ఇంటి పెంపుడుకుక్క తను!

''అమాయక చక్రవర్తీ ఈ సంఘంలో ఎలా బ్రతుకుతావు?'' లేని పెద్దరికాన్ని తెచ్చిపెట్టుకుంటూ అమూల్య.

ఆ మందలింపు మనోజ్ఞం. అందులో అవహేళన లేదు. ఆరాధన నిబిడీకృతమై వుంది.

అమూల్య జ్ఞాపకం ఓ తియ్యని స్పందన. బ్రతుకు చేదుమాత్ర మింగించినా, ఆ జ్ఞాపకమే తనని ఊరడిస్తూంది.

కాలగర్భంలో యుగాలు కలిసిపోయాయి.

''ఇప్పుడు అమూల్య....? ఊహకందని ప్రశ్న....సౌజన్యమూర్తిగా!'' ఎవరో పిలిచారు. ఆ హడావిడిలో జ్ఞాపకాలు చెల్లాచెదరయ్యాయి.

పెళ్లిపీట దగ్గరగా నడిచాడు.

మరొక్కసారి పెళ్లికూతురి ముఖంలోకి పరిశీలనగా చూశాడు. ముత్యాల్లా చెక్కిళ్ల మీద జారుతున్నాయి అశృకణాలు.

ఆయన మనస్సు కలుక్కుమంది.

''ప్రమద బలిపశువా? మనిషి స్వేచ్ఛాజీవి కాదా? ఏదో సందర్భంలో బంధింపబడడం శాపం ఏమో?''

ఒక్కసారి హడావిడి మొదలయ్యింది.

మంగళవాద్యాల మధ్య ప్రమద మెడలో పసుపుతాడు బిగుసుకుంది.

''ఇప్పుడామె బందీ!''

మీనాక్షీదేవి గారి కన్నులలో జయించానన్న కాంతి. వరూధిని ముఖంలో ధన దర్పంతో కూడిన అహం. మరొక్కసారి పేదరికం మీద దెబ్బతీసిన అధికారమదం.

ఈ ఇంట్లో మరోవ్యక్తి నిర్బంధ జీవనానికి నాందీ పలికి; కుడికాలు మోపింది.

పాదాభివందనం చేస్తున్న కోడల్ని లేవనెత్తి ''జీవితం ఏమిటి?'' అని ప్రశ్నించుకున్నాడు మొట్టమొదటిసారిగా సౌజన్యమూర్తిగారు తనలోతానే.

రేపు ఈతల్లి మాతృమూర్తి అయి బిడ్డను కంటే మళ్లీ ఇలాంటి మాటలే వినాలా?..కాని..కాని..ఈ తల్లి ధనమదాంధురాలు కాదు! నిరుపేద జీవనం లోంచి పై అంతస్థుకి బలవంతంగా ఎక్కివచ్చిన అమాయకురాలు. కొత్తకోడలు ఇంట్లో లక్ష్మిలా..కాదు..కాదు.. కట్టుబానిసలా తిరుగాడుతోంది.

''మామయ్యా కాఫీ!'' ఆలోచనల నుండి తేరుకున్నారు సౌజన్యమూర్తిగారు.

ఎదుట కాఫీ కప్పుతో మూర్తీభవించిన సౌజన్యంలా

ప్రమద. కోడలు ప్రమద. ఒంటినిండా ఖరీదైన నగలతో కోడలు ప్రమద.

ఆమె చేతిలో కాఫీ కప్పు అందుకున్నాడు. ఇన్నాళ్ళకి తనని పట్టించుకునే మనిషి తటస్తపడింది.

''అమ్మాయ్ నీకు ఈ ఇంట్లో ఏ ఇబ్బందీ లేదు కదా?'' మొట్టమొదటిసారిగా నోరువిప్పి ప్రశ్నించే స్థితికి ఎదిగాడు.

చిన్నగా నవ్వి వెనుదిరిగింది ప్రమద.

''పసిపిల్ల!'' అనుకున్నాడు సౌజన్యమూర్తిగారు.

నెలరోజులు దొర్లాయి! ఈ నెలరోజుల్లో కొడుకూ కోడలూ మాట్లాడుకుంటున్నట్లుగాని, వారి సంసార బంధం పటిష్టంగా వున్నట్లుగాని ఆయన అనుకోలేదు.

ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వుంటున్నారు.

వీళ్ళిద్దరి గురించీ పట్టించుకున్న వాళ్ళూ లేరు.

వృద్ధ జమీందారిణీ తన తోటి వాళ్లతో మత్తు పానీయాలూ, పేకాటలతో గడుపుతోంది.

చిన్న జమీందారిణీ వరూధిని క్లబ్బులు, మహిళా మండలులు, పంక్షన్లు, ఆడామగా తేడా తెలియని స్నేహాలు వీటి మధ్య ఊగిసలాడిపోతోంది.

రోజులు నిర్లిప్తంగా దొర్లు తున్నాయి.

ఏవో సన్నాహాలు, ఇంకేవో ప్రయత్నాలు, కొడుకుని ఎక్కడికో పంపాలన్న తాప త్రయం తనకు తెలియ కుండా సాగుతున్నాయి.



ఆరోజు టేబిల్ మీద టిఫెను సర్దుతున్న కోడల్ని ప్రశ్నించారు సౌజన్యమూర్తిగారు. ''అమ్మాయ్. నీ భర్త ప్రయాణం ఎంతవరకు?'' కళ్లద్దాలు తీసి కండువాతో తుడుస్తూ, ఒక్కసారి ఆశ్చర్యంగా చూసి, అంతలోనే తల వంచుకుని ప్లేట్లో ఉప్మా పెసరట్టు వడ్డించింది.

''నీ భర్త నీకేం చెప్పలేదా ప్రమదా?'' ఆమె ముఖంలోకి నిశితంగా చూస్తూ మరోసారి ప్రశ్నించాడాయన.

లేదన్నట్టు తలవూపింది ప్రమద. వింతగా కదిలాయి ఆమె చెవులకున్న డైమండ్ లోలాకులు.

''నువ్వు అడగలేదా?'' ఈ మధ్య సౌజన్యమూర్తిగారిలో కొత్తధైర్యం చోటు చేసుకుంటోంది.

''అడిగాను! నవ్వి ఊరుకున్నారు. తరువాత మామ్మగారు చెప్పారు'' ''శివతేజని అమెరికా పంపుతున్నారు''

పెదవులు విడీవిడనట్టు నవ్వింది ప్రమద.

సంగతి అర్థమయ్యింది సౌజన్యమూర్తిగారికి. సంఘంలో స్టేటస్ కోసం కోడల్ని తెచ్చారు. ఇంకా స్టేటస్ పెంచడం కోసం స్టేట్స్‌కు పంపుతున్నారు.

ఇదో చదరంగం. తాము పావులు. ఏ గడిలోకి నప్పితే అక్కడికి చేరతాయి.

మరొక్కసారి ప్రమద ముఖంలోకి చూశారు సౌజన్యమూర్తిగారు. అనిర్వచనీయమైన నైరాశ్యం ఏదో గూడుకట్టుకుని వుంది ఆమె ముఖంలో.

అసలు ప్రమద హృదయంలో తేజాకి స్థానం వుందా? అడగాలనుకున్న ప్రశ్న పెదాలు దాటి బైటికి రాలేదు.

ఇప్పటికీ తేజా అంతరంగం తనకి అవగతం కాదు? తన కొడుకు తనలా కాకూడదని వెయ్యిదేవుళ్లకి మొక్కాడు.

అనుకున్న రోజు రానే వచ్చింది. తేజా అమెరికా వెళ్లిపోయాడు. అమ్మ, అమ్మమ్మల ముఖాలలో కొట్టవచ్చిన కాంతి ద్యోతకమవుతూంది.

''నాన్నా నేను వెళ్లొస్తాను!'' తేజా చెప్పాడు. తాను నిర్లిప్తంగా వుండిపోయాడు.

ఆ ఇంటి కోడలు తన లాంటి మరో మట్టి బొమ్మ, చేష్టలు దక్కి చూస్తూ వుండిపోయింది.

ఇంట్లో వింత నిశ్శబ్దం.

తన ఒంటరి జీవితానికి ఇంకో ఒంటరిజీవి తోడు.

వేదాంతంతో కూడిన నవ్వు వెలిగింది పెదాలమీద. తనకి తోడు నీడగా జీవితం చివరి వరకూ సాగిపోవలసిన వ్యక్తి తనకి దూరమయ్యింది.

''ఆ బంధం వేరు! ఈ అనుబంధం వేరు!''

అది ప్రేమబంధం! విడిపోదని పిచ్చి భ్రాంతిలో పడి కొట్టుకుపోతున్న తరుణంలో నిర్దాక్షిణ్యంగా త్రెంచి, కొత్తజీవితంలోకి నెట్టి చేతులు దులుపుకున్న పెద్దరికాన్ని ఎదిరించలేని తనుతనుగానే మిగిలాడు.

మరి అమూల్య? జీవితం చరమాంకానికి సాగిపోతున్నా తనని నీడలా వెంటాడుతున్న జ్ఞాపకం.

ఇప్పుడు అమూల్య ఎలా వుందో? ఆఖరికి వచ్చేముందు వీడ్కోలు కూడా తీసుకోలేని బలహీనత తనది.

తను గుఱ్ఱపు బగ్గీ ఎక్కి కనుమరుగవుతూవుంటే, దూరంగా చెరువుగట్టుమీద అమూల్య, మంచుబొమ్మలా అమూల్య.

రోజులు దొర్లుతున్నాయి.

సౌజన్యమూర్తిగారు ముందు హాలులో సోఫాలో కూచుని న్యూస్ పేపరు చదువుతున్నారు.

ఆయన మనస్సు పేపరులో నిలవడం లేదు. కోడలు ప్రమద ఏం చేస్తూ వుంటుంది?

ఎన్నోసార్లు చూశాడు తను. ఆమె ఒంటరిగా తన గదిలో కూచుని పుస్తకాలతో కాలక్షేపం చేస్తూవుంటుంది. ఒకటి రెండుసార్లు ఆమె కళ్లల్లో నీరు ఉబికి రావడం చూశాడు.

తనలాగే ఆమె కూడా ఈ ఇంట్లోకి నెట్టి వేయబడిందా? తెలీదు. ఆమె చెప్పదు.

మెల్లిగా మేడ మెట్లు ఎక్కి వెళ్లాడు. ప్రమద గది తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. మెల్లిగా నెట్టి లోపలికి ప్రవేశించాడు.

ప్రమద లేదు. బహుశా బాత్‌రూమ్‌కెళ్లి వుండవచ్చు! మంచం మీద సగం చదివి పెట్టిన పుస్తకం. దాన్ని తీసి చూశాడు. అదొక తెలుగు నవల. నాలుగు పేజీలు చదివాడు.

ప్రేమికుల మనోదౌర్బల్యానికి దర్పణం పట్టే రసవాహిని అది.

పేజీలు తిరగేస్తూ వుండగా క్రిందపడింది ఓ కవరు. దాన్ని తీసి తెరిచి చూశాడు. అందులో ఓ అందమైన యువకుడి ఫొటో, ఓ ఉత్తరం.

ఉత్తరం చదవకూడదు. కాని చదివాడు మౌనంగా. అది భగ్నప్రేమకు అద్దం పట్టినట్టుంది.

సంగతి అవగతమయ్యింది.

ఇంతలో ప్రమద. ఎదురుగా ప్రమద. తెల్లబోయి, అంతలోనే తెప్పరిల్లి ''ప్రమద, నువ్వు..నువ్వు..వంచింపబడ్డావా?''

బావురుమంటూ ఆయన్ని వాటేసుకుంది. ''మామయ్యా!'' అంటూ.

క్షణకాలం ఆమె తల నిమురుతూ వుండిపోయారు సౌజన్యమూర్తిగారు.

సౌజన్యమూర్తిగారిలో మెరుపులాంటి ఆలోచన కదలాడింది. తను కొంచెం ముందుకు నడిచి ఆమెని నడిపించాలి! బిగుసుకున్న ఇనపసంకెళ్లను విప్పి స్వేచ్ఛావాయువుల్ని పీల్చుకునేలా చెయ్యాలి!''

ఈయేభయ్యేళ్ల జీవితంలో స్వతంత్రమైన నిర్ణయానికి నాందీ పలికాడు.

మొట్టమొదటిసారిగా కొడుక్కి సంగతి వివరిస్తూ, చాలా కఠినంగానే ఉత్తరం రాశాడు.

వెంటనే జవాబు వచ్చింది తనకు నచ్చిన విధంగా, తను ఆశించినట్టుగా.

గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నాడు.

ఆరాత్రి ఆలోచనలతో ఆయనకి నిద్రపట్టలేదు.

మరో నాలుగు రోజులు దొర్లాయి.

''ప్రమదా ఎవరతను?'' కోడల్ని సూటిగా ప్రశ్నించారు సౌజన్యమూర్తిగారు.

అర్జునపల్లి..అర్జునపల్లి..తనూ అమూల్య ప్రేమ బావుటాలు ఎగురవేసిన ఊరు, స్మృతి పథం నుండి తొలగిపోని ఊరు..ఆ జలపాతాలు, ఆ కొండచరియలు...ఆ గుట్టలూ...ఆ పుట్టలూ...అన్నీ..ఇంకా ఎన్నో..ఎన్నో.

మనస్సు ఎన్నో ఏళ్లు గతంలోకి పరుగులు తీసింది.

తల్లిదండ్రులు లేని తనని నాన్నమ్మా తాతయ్యలు అల్లారుముద్దుగా పెంచారు. ప్రేమను పంచి యిచ్చారు. తను పెరుగుతున్నాడు. ఏదో చదువుతున్నాడు. పరీక్షలు..డిగ్రీలు..లేని చదువులు.

తన పద్దెనిమిదేళ్ల వయసులో, మొట్టమొదటిసారి ప్రపంచాన్ని చూస్తున్న తరుణంలో ఎదురింట్లో తళుక్కుమన్న ఓ మెరుపు మెరిసింది.

ఆమె అమూల్య!

తల్లిదండ్రుల్ని పోగొట్టుకుని పినతండ్రి యింటికి చేరింది. ఇద్దరి జీవిత విధానాలు ఒకటే.

తనని చూస్తూ పలకరింపుగా నవ్వేది.

తెల్లని పలువరుస తళుక్కుమనేది.

తన ఆలోచనలు అమూల్య చుట్టూ అల్లుకొనేవి. తన మనసు పిచ్చిగా కొట్టుకునేది.

అమూల్య తరుచు తను యింటికి వస్తూ వుండేది. నాన్నమ్మ తాతయ్యలతో మాట్లాడుతుండేది.

''అమూల్య నిన్ను ఎవరు చేసుకుంటారో చాలా అదృష్టవంతుడు సుమా!'' అనేవారు వాళ్లు.

ఆ అదృష్టం తనకే కలిగించకూడదూ? మనసులోనే అనుకునేవాడు తను.

పినతల్లి పెట్టే బాధలు చెప్పుకుంటూ వుండేది అమూల్య. పినతల్లి కట్టి విడిచిన పాత చీరలు యిస్తూ వుండేది అమూల్యకి. వాటినే అపురూపంగా కట్టుకుంటూ వుండేది అమూల్య.

సాయంకాలాలు నీలాటి రేవులలోనూ, ఉదయకాలాలు కొండరాళ్ల మధ్య కూచుని గంటలు గంటలు మాట్లాడుకునేవారు తనూ అమూల్య.

అలా అలా నడిచి వచ్చి చంద్రయ్య పర్ణకుటీరం చేరుకునేవారు.

''రండి బాబులూ!'' అనేవాడు చంద్రయ్య ఆదరంగా. చంద్రయ్య సంసారబంధాల్ని త్రెంచుకుని అడవిలో పర్ణ కుటీరం నిర్మించుకుని ఆకులు, అలములు, దుంపలు ధూళులు తింటూ కాలక్షేపం చేస్తున్నాడు.

కుటీరం మధ్య ఓ కృష్ణ విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. చుట్టూ నెమిళ్లు, లేళ్లు సంచరిస్తూ వుంటాయి. వాటిని చంద్రయ్య పెంచకపోయినా, చంద్రయ్యని అవి ప్రేమగా చూస్తూ వుంటాయి!

వీళ్లిద్దరి ప్రేమ గురించి చంద్రయ్యకి తెలుసు.

''అమ్మలూ ఈ పిచ్చి మారాజుని పెళ్లాడి నీ సొంతం సేసుకో!''అన్నాడు చంద్రయ్య ఒకనాడు.

ఆమాటలో హెచ్చరిక ధ్వనించింది.

అమూల్య ఒడిలో తల పెట్టుకుని చుక్కల్ని లెక్కిస్తూ ఏవేవో మాట్లాడుతున్న తనని లాలించి, బుజ్జగించి జుట్టులోకి వేళ్లు పోనిచ్చి, '' అమాయక చక్రవర్తీ.. ఈ మాయదారి ప్రపంచంలో ఎలా బ్రతుకుతావు?'' అంటూ మందలించేది.

ఆరోజు తనకి అర్థం కాలేదు.

నాలుగేళ్ల ప్రేమసామ్రాజ్యం తనదీ అమూల్యది. అమూల్య గ్రహించింది. ''నీకు పెళ్లి సంబంధం చూస్తున్నారేమో సౌజా!''

ఆ సాయంత్రమే నాన్నమ్మా తాతయ్యల నోటి ద్వారా విన్నాడా సంగతి.



## స్పీల్ బర్గ్ తాజా చిత్రం

**తీసిన ప్రతి సినిమాలోనూ తనదైన వెరైటీని ప్రదర్శించే హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ 1993లో నిర్మించిన 'జురాసిక్ పార్క్' ప్రపంచ వ్యాప్తంగా కలెక్షన్లలో రికార్డులు సృష్టించిన సంగతి అందరికీ తెలిసిందే. ఆ చిత్రం తరువాత ఇప్పుడు దాని కంటిన్యూయేషన్‌గా స్పీల్‌బర్గ్ తీసిన 'ది లాస్ట్ వరల్డ్' ఇప్పుడు టాకాఫ్ ది వరల్డ్ అయింది. జురాసిక్ పార్క్‌ని మించిన సంచలన విజయం సాధిస్తుందని అంటున్నారు. లేటెస్ట్ టెక్నాలజీతో అత్యంత భారీగా స్పీల్‌బర్గ్ స్టయిల్‌లో తయారైన ఈ 'ది లాస్ట్ వరల్డ్' సినిమా అతి త్వరలోనే మన దేశంలోనూ విడుదల కానుంది. మరి ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలి!**

- జె.ఎం.

అవాక్కయ్యాడు.

''నేనా..అమూల్యా..!'' పెదవులు దాటి రాలేదామాట.

''అమూల్యా మనం పారిపోదాం!'' అన్నాడు ఓ నిర్ణయానికి వచ్చినట్టు!

ఆశ్చర్యంగా చూసింది అమూల్య! ''నిజం?''

''ఒట్టు!'' పిరికితనం మాటున దాగిన ధృడత్వం ధ్వనించింది.

''సౌజా ఈరోజు ఎక్కడికీ వెళ్లకు! పెళ్లివారొస్తున్నారు'' నాన్నమ్మ అంది.

''ఎవరికి?''

''నీకు''

''ఎవర్ని అడిగేరు?'' నోటిలోనే ఆగిపోయిందామాట.

''ఇల్లరికం అన్న మాటేగాని, నీకే యిబ్బందీ వుండదు! రేపు మేం పోయినా మా ఆత్మలకి శాంతి వుంటుంది'' తాతయ్య చెప్పుకుపోతున్నాడు.

నోట మాట రాలేదు సౌజన్యమూర్తికి.

పెంచి పెద్ద చేశారన్న కృతజ్ఞత ప్రేమానుబంధాన్ని త్రెంచిపారేసింది. పెద్దరికం గెలిచింది. ప్రేమ ఓడిపోయింది.

పర్యవసానం నిశ్చితార్థం.

తులలేని సంపదకు తలవంచాడు తను. డాబూ దర్పాలకి ఓటు వేశారు నానమ్మ తాతయ్య.

రెండు రోజులు ఇల్లు కదలలేదు.

మూడోనాడు చంద్రయ్య కుటీరం వైపు నడిచాడు.

''ఎంత పని చేశావు బాబూ! అమ్ములు నీకోసం చూసి చూసి ఎళ్లిపోయింది. బాబూ అమ్ములు మనసు ఎన్ను! వొరైనా మనిషి మీద దెబ్బతియ్యొచ్చు!కాని. మనసు మీద దెబ్బతియ్యకూడదు!''

సన్నగా చీవాట్లు పెట్టాడు చంద్రయ్య.

సిగ్గుతో పిరికితనంతో, కన్నీటితో తలవంచుకున్నాడు తను.

మెల్లిగా ఇంటికి నడిచాడు.

దార్లో అమూల్య, కన్నీటితో..తనని తప్పుకుపోతూ.. ''అమూల్యా! ..న..న్ను..క్ష..మిం..చు!'' ఆ మాటని కూడా పిరికితనం కప్పివేసింది.

వరూధినితో పెళ్లి, ఇల్లరికానికి వెళ్లడం క్షణాలలో జరిగిపోయాయి.

అమూల్య రూపం చెరిగిపోని ముద్రలా నిలిచిపోయింది తన మనోఫలకం మీద. ఆమె జ్ఞాపకం తీపి గుర్తుగా మిగిలిపోయింది తన అంతరంగంలో.

వరూధినికి కావలసింది భర్త కాదు. భర్తస్థానంలో నిలబడే ఓ బొమ్మ. మొగుడుబొమ్మ.

విస్పంఖలత, దుస్వేచ్ఛ, అవినీతి ప్రవర్తనగల కూతురి కోసం భర్తను వెతకలేక, ఏరికోరి ఓ మారుమూల పల్లెటూరి నించి వెతికి పట్టుకొచ్చింది తనని మీనాక్షీదేవి.

'తన దురదృష్ట జీవితంలో ఓ చిన్న ఆశాకిరణం తేజా!

వాడు తనలా కాకూడదు. చరిత్రను తారుమారుచెయ్యాలి.'

''మామయ్యా!''ఒక్కసారి గతంలోంచి, ఆలోచనల్లోంచి బైటపడ్డారు సౌజన్యమూర్తిగారు.

కూడకట్టుకున్న ధైర్యంతో ప్రమద.

''ఇదిగో అడ్రసు!'' చిన్నకాగితం అందించింది. అందుకున్నారు.

''కొన్నాళ్లు అలా తిరిగి వస్తాను!'' అన్నారు గోడకు చెప్తున్నట్లు.

నిర్లక్ష్యంగా తల ఎగుర వేసింది వరూధిని.

''అర్జునపల్లి బైలు దేరారు. దార్లో కనుపించింది చంద్రయ్య పర్ణకుటీరం. ఇప్పుడు చంద్రయ్య లేడు. అతడు ప్రతిష్ఠించిన కృష్ణవిగ్రహం వుంది వెలవెలాపోతూ. నెమిళ్లున్నాయి. లేళ్లున్నాయి.

అడ్రసు కనుక్కోవడం కష్టం కాలేదు. రాజయ్య సాదరంగా ఆహ్వానించాడు.

అనూహ్యంగా ఎదురువచ్చిన అమూల్య.

అప్రతిభుడయ్యాడు.

''అమూల్యా!'' పలకరింపుగొంతులో ఆగిపోయింది.

''సౌజా బావున్నావా?'' ప్రేమ రంగరించి పోసిన పలకరింపు.

''తల ఊపాడు!'' ఎప్పుడు నోరు విప్పాడు తను?

''మా అబ్బాయి శ్రీహరి!'' పరిచయం చేశాడు రాజయ్య. చాకులావున్నాడు కుర్రాడు. ప్రమదకి తగినవాడు.

విషయం వివరించి చెప్పాడు కొంతసేపటికి. ''నువ్వేనా ఇన్ని మాట లాడుతున్నది?'' అన్నట్లు చూసింది అమూల్య.

''ఇప్పుడు ప్రమద వచ్చినా నిండు మనసుతో స్వీకరిస్తాం!'' రాజయ్య నుండి ధృడంగా వచ్చిందామాట!

సౌజన్యమూర్తిగారి కళ్లు వెలిగాయి ఆనందంతో.

ఆ సాయంత్రం భర్త, కొడుకు పొలమెళ్లిన తరువాత అంది అమూల్య. ''సౌజా నిన్ను గురించి ఆయనకి తెలుసు!'' అని.

రాజయ్య స్టేషన్ వరకూ వచ్చాడు.

''అమూల్య మిమ్మల్ని గురించి చెప్తూ వుంటుంది! ఒకరు పోగొట్టుకున్న పెన్నిధి ఇంకొకరికి దొరకడం అదృష్టం కాదంటారా?''

''నిజమే! మీరు వెళ్లండి. నేను వస్తాను'' అంటూ రైలెక్కాడు సౌజన్యమూర్తి.

★ ★ ★

మీనాక్షీదేవిగారు పోయి నెల దాటిందిట. వింత నిశ్శబ్దం ఆవరించి వుంది. ఇంట్లో కనీసం తనకి తెలియజేయలేదు.

''తేజా రాలేదట!'' ఓ ఉత్తరం తెచ్చి అందించింది ప్రమద.

తానొక విదేశీ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాననీ, ఇకపై ఇండియా తిరిగి రాననీ సారాంశం.

మొట్టమొదటిసారిగా మనసు నిండుగా నవ్వారు సౌజన్యమూర్తిగారు. ''విత్తొకటివేస్తే మొక్కొకటి మొలుస్తుందా?''

ప్రమదని పంపించాడు ఆశీర్వదించి.

విలయతాండవం చేసింది వరూధిని ''కోడలేదీ''అని.

''నేను పంపించాను!''

''ఎక్కడికి?''

''ఆమెకి నచ్చిన చోటుకి, ఆమెను మెచ్చేచోటుకి!''

''మీరెవరు?''

''మానవత్వం వున్న మనిషిని!'' తన జీవితంలో రెండు ఘన కార్యాలు సాధించానన్న సంతృప్తి ఆయన అంతరంగంలో చోటు చేసుకుంది.

''నేను కూడా వెళ్తున్నాను!''

''ఎక్కడికి?''

అర్థం లేని ప్రశ్న.

''నేను లేకపోతే మీకు సంఘంలో స్థానం లేదు.''

''అది పిచ్చిమాట! ఈ సువిశాల విశ్వంలో నాకు కొంత చోటు దొరకక పోదు!'' అంటూ నిర్బంధంగా ఎక్కించిన అంతస్థుల నుండి దిగి, ఆత్మాభిమానమనే ఆస్తితో సాగిపోయారాయన.

వరూధిని భర్తగా కాదు!

సౌజన్యమూర్తిగా..ఎటు? ఎటు?

చంద్రయ్య మిగిల్చిన పర్ణకుటీరం వైపుగా!

★



## రవీనా వార్నింగ్!

టీవీలో ఓ పెన్నుల కంపెనీ యాడ్ ఫిలిం అందరూ చూసే వుంటారు. అదేనండీ 'లిఖ్ లిఖ్తే లవ్ హో జాయే ..' ఆ..రొటోమాక్ పెన్నుల యాడ్. ఇందులో నటించిన సినీ తార రవీనా టండన్ ఇప్పుడా కంపెనీవారి మీద కారాలు మిరియాలు నూరుతోంది. ఎందుకంటారా? ఆ యాడ్ ఫిలిం కేవలం ఒక సంవత్సరం కాంట్రాక్ట్‌పై తీసుకున్నారట. ఇప్పుడు సంవత్సరం దాటిపోయినా కూడా 'రెన్యువల్' చేయలేదట. దాంతో రవీనా కోపం తారాస్థాయికి చేరిపోయింది. 'ఇంకొన్ని రోజులు చూస్తాను. ఆ తరువాత కూడా వాళ్లు 'రెన్యువల్' గురించి రాకపోతే కేసు వేస్తా' అంటోంది రవీనా. మరి రవీనా వార్నింగ్‌ని రొటోమాక్ వాళ్లు ఎంతవరకూ పట్టించుకుంటారో?

-జె.ఎం.